క్లుప్తంగా

శ్రీరామ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి గ్రామంలోని శ్రీరామ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మోస వరప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా గుంటి గురునాథం, ప్రధాన కార్యదర్శిగా అర్జాల ఈశ్వరరావు, ఉప కార్యదర్శిగా సింగుపల్లి జగన్నాథం, కోశాధికారిగా కాస చలపతిరావు, కార్యవర్గ సభ్యులుగా పలువురుని ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సూరాడ మోహన్‌రావు అధ్యక్షతన ఎన్నిక ప్రక్రియలో సింగుపల్లి బాలకృష్ణ, లండ రాజు, ఉమాపతి, శ్రీకాంత్, మురళి, లోకనాథం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో మోస్తరు వర్షం


ఇచ్ఛాపురంలో కురుస్తున్న వర్షం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. కొద్దిరోజులుగా వర్షం లేక వరి పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ పరిస్థితిలో కురిసిన వర్షం వరితో పాటు మిగిలిన పంటలకు జీవం పోషిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇంటర్మీడియెట్ విద్య కీలకం


మాట్లాడుతున్న ఎంఈవో ధనంజయమజ్జి

కవిటి: ప్రతివిద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ కీలకదశ అని ఎంఈవో ధనంజయమజ్జి అన్నారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రిన్సిపాల్ పేడాడ రాజేశ్వరరావు అధ్యక్షతన బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆకాంక్షలను నిజం చేయాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. ఉన్నతమైన లక్ష్యాల్ని ఏర్పాటు చేసుకొని జీవితంలో ఉన్నత ఉద్యోగంలో స్థిరపడేందుకు అవసరమైన ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అనంతరం బాలబాలికలచే ఏర్పాటుచేసిన కల్చర్ కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

పంచాయతీ ఈవోకు అభినందనలు


శాంతికుమారిని సత్కరిస్తున్న సిబ్బంది

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీ ఈవోగా నియమితులైన శాంతికుమారి బుధవారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి ఈవో సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ అప్పారావు

కంచిలి: ఇదివరకు మంజూరైన ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తిచేయాలని హౌసింగ్ ఏఈ ఎ.అప్పారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ప్రత్యేక సమావేశాన్ని ఎంపీడీవో వి.నీరజ అధ్యక్షతన నిర్వహించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు.

బాలలను పనుల్లో పెడితే చర్యలు


దుకాణ యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

సోంపేట: 14 సంవత్సరాల్లోపు బాలబాలికలను పనుల్లో పెడితే చర్యలు తప్పవని విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు, కార్మికశాఖాధికారి విజయ్‌కుమార్ దుకాణాల యజమానులను హెచ్చరించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా సోంపేట పట్టణంలోని పలు దుకాణాలను బుధవారం పరిశీలించారు. యజమానులకు బాల కార్మిక చట్టాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి స్వాతి, చైల్డ్ లైన్ సిబ్బంది రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాత్రి వేళ సిబ్బందికి భద్రత ఉండాలి

ఆస్పత్రుల్లో రాత్రి సమయంలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ప్రత్యేక భద్రత కలిగే విధంగా చట్టం ఉండాలి. కొన్ని సందర్భాల్లో రోగులతో వచ్చే వారి నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. కోల్‌కతా వంటి సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వాలు చూడాలి.
– ఎస్.నీలవేణి, స్టాఫ్ నర్స్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి





స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించాలి

గ్రామీణ ప్రాంతాల్లో.. ఊరికి దూరంగా ఉన్న ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా సిబ్బందికి స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించాలి. ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లు, ప్రత్యేక కార్యక్రమాలు రాత్రి వేళల్లో చేయడం వలన మహిళా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నైట్ డ్యూటీ చేసే మహిళా సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పించాలి. వైద్యులపై దాడి చేసేవారికి తక్షణ శిక్షలు అమలు చేయాలి.
– ఆర్.సుకన్య, వైద్యురాలు, పీహెచ్‌సీ, నందిగాం

అమ్మ భాషకు వందనం!

- మాతృ భాష కోసం కృషి చేస్తున్న సిక్కోలు కవులు
- నేడు తెలుగు భాషా దినోత్సవం


తెలుగు ఆకృతిలో ఈదుపురం విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: ఎన్నో యాసలు. మరెన్నో 'పలుకుబడు'లు. మాటమాటలో తియ్యదనాలు. తెలుగందానికి నలుచెరుగులా దక్కిన అందలాలెన్నో. కానీ నేడు ఆ పరిస్థితి దిగజారిపోతుంది. మాటకైనా నోచుకోని మృత్యుభాషగా మిగిలిపోతుంది. దీనికి ఎవరినీ నిందించలేని పరిస్థితి. మళ్లీ మన భాష వికసించాలంటే, తెలుగు మాట పదిల పరుచుకోవాలంటే మనమంతా 'తెలుగు నడక' నేర్వాలి. అమ్మ పదానికి స్వేచ్ఛ కావాలి.

మాతృ భాషా సేవలో..
శ్రీకాకుళం జిల్లాలో ఎందరో రచయితలు, కవులు, కళాకారులు సిక్కోలు సాహిత్యాన్ని, మాండలికాన్ని తమ కథలు, కవితలు, గజల్స్, పాటలను ప్రపంచానికి పరిచయం చేశారు. అందులో తెలుగు భాషకు, తెలుగు జాతికి వెలుగు దీపికలై ప్రకాశించిన అతికొద్ది మందిలో అగ్రగణ్యుడు గిడుగు వెంకట రామమూర్తి. తెలుగు ప్రజలంతా కలిసి ఉండాలని తపిస్తూ తన జీవిత పర్యంతమూ పోరాడిన ధీశాలి. సామాన్య ప్రజల భాషకే ప్రభుత్వాలు పట్టం కట్టేలా వ్యవహారిక భాషోద్యమాన్ని మహోన్నతంగా నడిపిన భాషా వేత్త గిడుగు.

- ''మాకొద్దీ తెల్ల దొరతనం'' అంటూ సత్యాగ్రహాల్లో గొప్ప తెగువను, ఉత్తేజాన్ని కలిగించి ''దండాలు దండాలు భారత మాత'' అంటూ ప్రజలను ఎంతగానో జాగృతం చేసిన కవి గరిమెళ్ల సత్యనారాయణ. నరసన్నపేట దగ్గర్లోని గోనెపాడుకు చెందిన ఈయన పరాయి పీడనకు, పాలనకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడి స్వేచ్ఛ, విముక్తి కోసం కలం పట్టి, గళమెత్తారు.
- తెలుగు కథా సాహిత్యంలో కాళీపట్నం రామారావు(కారా) మాస్టారుది ఓ ఒరవడి. సరళ భాషా రచయితగా, కథకుడుగా, విమర్శకుడిగా ఆయన శైలి విభిన్నంగా ఉండేది. ఆయన రాసిన 'యజ్ఞం' కథకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. సిక్కోలు కథా 'యజ్ఞాన్ని' సాగించిన కారా మాస్టారు కథ కోసం ఓ నిలయాన్నే స్థాపించారు.
- పొందూరుకు చెందిన వాండ్రంగి రామారావు (భావశ్రీ) తెలుగు సినీ రచయితగా, కవిగా, మంచి వక్తగా, వ్యాఖ్యాతగా, ఆకాశవాణి ప్రసంగికుడుగా సుపరిచితులు. 'తెలుగుజాతి నాది', 'తెలుగు సంస్కృతి నాది', 'నాకు అనేక భాషలు వచ్చినప్పటికీ నేను తెలుగు కవినే' అని చెప్పేవారు. వీరితో పాటు ఎం.సత్యనారాయణమూర్తి, డాక్టర్ ఎం.వి.రమణారావు, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు వంటి వారు ఎంతో మంది ఉన్నారు.

తెలుగు వెలుగుల కోసం సాహిత్య సంస్థలు
సాహిత్య సంపదకు నిలయమైన శ్రీకాకుళం జిల్లాలో అనేక సంఘాలు, సాహితీ సంస్థలు ముందుంటాయి. ముఖ్యంగా తెలుగు రచయితల వేదిక(తెరవే), విశ్వసాహితీ, అభ్యుదయ రచయితల వేదిక, సుమిత్ర కళా సమితి, రాజాం రచయితల వేదిక, అభ్యుదయ రచయితల సంఘం (అరసం), జనజాగృతి సాహితీ సంస్థ, లలిత కళా రంజనీ సంఘం, శ్రీశ్రీ కళావేదిక, ఈవేమన కవితా నిలయం. సాహితీ స్రవంతి, భారతీ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, సాహితీ కిరణాలు, కళింగసీమ సాహిత్య సంస్థ, గిడుగు రామ్మూర్తి జానపద కళా పీఠం, ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదికలు తెలుగు భాష కోసం తమ వంతు కృషి చేస్తున్నాయి. ఈ సంస్థలు కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, సమావేశాలు, సాహిత్య గోష్ఠిలతో తెలుగు వెలుగులు నింపుతున్నాయి.

మాతృ భాషను ప్రోత్సహించాలి



దేశభాషలందు తెలుగు లెస్స అన్నారు శ్రీకృష్ణదేవరాయులు. మన మాతృ భాష, ప్రాచీన భాష తెలుగు. తెలుగు నేలల జీవన ప్రయాణాన్ని, ప్రజల సంస్కృతిని సాధ్యమైనంత వరకు నా రచనల్లో కొనసాగిస్తున్నాను. పరభాషలు ఎన్ని నేర్చుకున్నా మాతృభాష కళ్ల వంటిది. ప్రభుత్వాలు మాతృభాషను ప్రోత్సాహించాలి
– అట్టాడ అప్పలనాయుడు, రచయిత, వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత

17వ ఏట నుంచే రచనలు



తెలుగు భాష అంటే నాకు ప్రాణం. 17వ ఏటనే కవితలు రాయడం ప్రారంభించి వందల సంఖ్యలో కవితలు రాశాను. కలిమి మేసిన కోయిల, నెల విడిచిన చంద్రిక, కళంకిత, భారతీయం వంటి ఉత్తమ కవితలకు 30 రాష్ట్ర స్థాయి, పది జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు పొందాను.
– కుప్పిలి వెంకట రాజారావు, రచయిత, ఆమదాలవలస

మాతృభాషను మించింది లేదు



కన్నతల్లి ప్రేమ, పుట్టి పెరిగిన ఊరు, మాతృభాషపై మమకారం తీరనిది. రాష్ట్రంలోనే శ్రీకాకుళానికి ప్రత్యేక స్థానం ఉంది. మాతృభాషాభివృద్ధిలో ఎంతో మంది కవులు, కథకులు తమ రచనల ద్వారా సిక్కోలు సాహిత్య సేవలో తరిస్తున్నారు.
– కురమాన కమల, తెలుగు భాషోపాధ్యాయురాలు, ఇచ్ఛాపురం

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి


నందిగాం: గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు


కంచిలి: కొనక గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

నందిగాం: కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఎంపీడీవో టి.రాజారావు అన్నారు. కల్లాడ పంచాయతీ భర్తుపురంలో ప్రధానమంత్రి జన్‌మన్–2లో గిరిజనులకు అందజేస్తున్న పథకాల అమలుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి పలు పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే గ్రామంలో స్కాలర్‌షిప్‌లు, ప్రసూతి లబ్ధి పథకాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, కిసాన్ సమ్మాన్‌నిధి కోసం, సికెల్ సెల్ వ్యాధిగ్రస్తులు సాయం కోసం దరఖాస్తు చేసుకుంటే వారిని గ్రామ సభ ద్వారా గుర్తించి వారి వివరాలను సీతంపేట ఐటీడీఏ పీవోకు అందిస్తామన్నారు. కందులగూడెం, మల్లివీడు గ్రామాల్లో కూడా సదస్సులు జరిగాయి. ఉపాధిహామీ ఏపీవో నాగరాజు, వెలుగు ఏపీఎం జాంభవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి, నౌగాం హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, మండల విద్యాశాఖాధికారి–2 చిన్నారావు, స్థానిక నాయకులు మడపాల తిరుపతిరావు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి
కంచిలి: ఏజెన్సీలో ఉండే గిరిజన ప్రజల అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు స్థానిక ఎంపీడీవో వి.నీరజ తెలిపారు. కుంబరినౌగాం పంచాయతీ పరిధి కొనక గ్రామంలో పీఎం జన్‌మన్ పథకం గ్రామసభను స్థానిక సర్పంచ్ హరిబంధు జన్ని అధ్యక్షతన నిర్వహించారు. ఈ పథకం ద్వారా గిరిజనులకు చేకూరనున్న ప్రయోజనాన్ని వివరించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు సింహాచలం జన్ని, పశువైద్యాధికారిణి టి.శిరీష, హౌసింగ్ ఏఈ అప్పారావు, ఉపాధిహామీ ఏపీవో బి.ధనుంజయ ఉన్నారు.

రూపుదిద్దుకుంటున్న గణనాథులు


ఇచ్ఛాపురం సమీపంలో అమ్మకాలకు సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు

ఇచ్ఛాపురం రూరల్: గణపతి నవరాత్రుల నిర్వహణకు సమయం సమీపిస్తోంది. దీంతో ఉత్సవ కమిటీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ఉత్సవాలకు కావాల్సిన వినాయక విగ్రహాలు కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకుంటున్నాయి. వచ్చే నెల ఏడో తేదీన వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా పట్టణ, పల్లెల్లో అప్పుడే సందడి మొదలైంది. బరంపురం, భువనేశ్వర్, కటక్, కోల్‌కతా ప్రాంతాల నుంచి శిల్ప కళాకారులు నెల రోజుల ముందు నుంచే ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట వంటి ప్రాంతాలకు చేరుకొని బొజ్జ గణపతుల విగ్రహాలు తయారీ చేసే పనిలో పడ్డారు. చిన్న విగ్రహాలతోపాటు ఐదు వందల రూపాయల నుంచి రూ. 25 వేలు విలువ చేసే విగ్రహాలను తయారీ చేస్తున్నారు. బొమ్మలకు రంగులు వేసే పనిలో కళాకారులు బిజీగా ఉన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు శుభరాట


కవిటి: రామయ్యపుట్టుగలో శుభరాట వేస్తున్న భక్తులు


వజ్రపుకొత్తూరు రూరల్: పందిరిరాటకు పూజలు చేస్తున్న భక్తులు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో వచ్చేనెల ఏడో తేదీ నుంచి నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు బుధవారం శుభరాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో పవిత్రమైన వేపచెట్టును ప్రత్యేక పూజలు నిర్వహించి శుభరాటగా వేశారు. ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు శుభరాట కార్యక్రమం నిర్వహణ తర్వాత చకచకా పనులు ప్రారంభించనున్నారు.

బైపల్లిలో..
వజ్రపుకొత్తూరు రూరల్: వినాయక పూజా మహోత్సవాల కోసం బైపల్లిలో బుధవారం చెల్లూరి కుసరాజు ధనలక్ష్మి దంపతులు సమక్షంలో పందిరిరాట వేసి పూజలు చేశారు. గణపతి నవరాత్రులను వైభవంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

బాలకృష్ణరావుకు కృష్ణదాస్ పరామర్శ


బాలకృష్ణారావుతో మాట్లాడుతున్న కృష్ణదాస్ తదితరులు

నందిగాం: వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ వాహనానికి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లట్టిగాం సొసైటీ అధ్యక్షుడు కురమాన బాలకృష్ణారావును మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం నందిగాంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరు, పొందుతున్న చికిత్సను కృష్ణదాస్ అడిగి తెలుసుకున్నారు. బాలకృష్ణారావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈయన వెంట పేరాడ తిలక్, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కణితి కృష్ణారావు, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, జడ్యాడ జయరాం, చిన్ని జోగారావు ఉన్నారు.

ప్రధానమంత్రి మోదీ పాలనలో దేశాభివృద్ధి


బాలకృష్ణను అభినందిస్తున్న మందస బీజేపీ నాయకులు

కాశీబుగ్గ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన మందస మేజర్ పంచాయతీలోని అన్నపూర్ణమ్మ గ్రామదేవత ఆలయ ప్రాంగణంలో కార్యకర్తల సమక్షంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మందస మండల బీజేపీ అధ్యక్షులు పొందర సుదిప్తి పాత్రో, డి.పున్నయ్య, ఆర్.లక్ష్మణరావు, దేవానందపట్నాయక్, హడ్డి గొడ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం పట్టణ ఎస్సై బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ పోలీస్‌స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన ఇ.చిన్నంనాయుడు బుధవారం విధుల్లో చేరారు. ఇతను మన్యం పార్వతీపురం జిల్లా చిన్నమేరంగి పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన వి.సత్యనారాయణ పొందూరు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సైకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చిన్నంనాయుడు చెప్పారు.

మొక్కలు నాటివేత


మొక్కలు నాటుతున్న వనితా సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిని 27వవార్డు ఉల్లాసపేట బద్రమ్మ కోనేరు పార్కులో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. పలాస లయన్స్ క్లబ్ ఆఫ్ క్యాజులాండ్ అండ్ వనిత ఆధ్వర్యంలో కోనేరు చుట్టూ మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు తర్లానా శ్వేతకుమారి, కార్యదర్శి మల్లా సంతోషి, కోశాధికారి తూముల గాయత్రి, పూర్వపు అధ్యక్షురాలు మల్లా జయశ్రీ పాల్గొన్నారు.

చెరువులోకి గంబూషియా చేపపిల్లలు


కోనేరులో చేపపిల్లలను విడిచి పెడుతున్న దృశ్యం

సోంపేట: దోమల నియంత్రణలో భాగంగా పలాసపురం మంచినీటి కోనేరులో గంబూషియా చేప పిల్లలను జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, మత్స్యశాఖ సబ్‌డివిజన్ అధికారి నల్లన లక్ష్మీనారాయణ బుధవారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు యశోద మాట్లాడుతూ.. చెరువుల్లో వృద్ధి చెందుతున్న దోమల లార్వాను చేపలు తిని తద్వారా దోమల ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బిజినెస్ వర్క్‌షాప్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి: జాతీయ స్థాయి బిజినెస్ ప్లాన్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి రెండు రోజుల పాటు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఐఐఎం కోల్‌కతా, మేక్ ఇంటర్న్ సంస్థల సౌజన్యంతో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డి.విష్ణుమూర్తి, ఎంబీఏ హెచ్‌ఓడీ బి.శివకుమార్, ప్రొఫెసర్లు కె.వేణుగోపాల్, చింతామణి పట్నాయక్, ప్రణయ పాల్గొన్నారు.

• ఇదేమి 'చెత్త'పని!


పేరుకుపోయిన చెత్త

టెక్కలి: పారిశుద్ధ్యం క్షీణిస్తుండడంతో రోగాలు విజృంభిస్తున్నాయి. జనం వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్నారు. అయినా పారిశుద్ధ్యం మెరుగుపై అధికారులు దృష్టిసారించడం లేదు. దీనికి టెక్కలి మేజర్ పంచాయతీలో సుదర్శన్ థియేటర్ ఎదురుగా నడిరోడ్డుపై డంపింగ్ యార్డును తలపించేలా పేరుకుపోయిన చెత్త నిల్వలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. చెత్త పేరుకుపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారంతా దుర్వాసనను భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదంలో నర్సింగపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు రట్టి సావిత్రమ్మ గాయపడింది. సావిత్రమ్మ తన కుమార్తె సుధ, మనువరాలను హైదరాబాద్ బస్సు ఎక్కించేందుకు బుధవారం రాత్రి టెక్కలి వచ్చారు. బస్సు జగతిమెట్ట జంక్షన్ వద్దకు వచ్చిందని ఫోన్ రావడంతో కుమార్తె, మనువరాలు ద్విచక్ర వాహనంపై వెళ్లగా.. సావిత్రమ్మ రోడ్డు పక్కగా నడుచుకుంటు వెళ్తుండగా టెక్కలి నుంచి కోటబొమ్మాళి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. సావిత్రమ్మ తీవ్రంగా గాయపడింది. ఇది గుర్తించిన స్థానికులు బస్సు ఎక్కుతున్న కుమార్తె సుధకు సమాచారం ఇవ్వగా.. వారు వెంటనే సావిత్రమ్మను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

గోశాలకు గేటు వితరణ


గేటును ప్రారంభిస్తున్న దాత రామారావు తదితరులు

కాశీబుగ్గ: పలాస మండలం రామక్రిష్ణాపురం సమీపంలో ఉన్న సత్యసాయి విద్యావిహార్, సత్యసాయి గోశాలతోపాటు అక్కడ ఉన్న మందిరం కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస–కాశీబుగ్గ వారి తరఫున 27 వేల రూపాయల విలువైన ఇనుప గేటును వితరణ చేశారు. దీన్ని దాత డోకి రామారావు దంపతులు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు హెచ్.వై.దొర, కార్యదర్శి ఎస్.అప్పారావు, బమ్మిడి నాగేశ్వరరావు, సత్యసాయి విద్యావిహార్ కన్వీనర్ మల్లా రామేశ్వరం, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి పాల్గొన్నారు.

నేడు బాలకృష్ణాపురం ఎస్‌ఎంసీ ఎన్నిక

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బాలకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికను గురువారం నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల ఎనిమిదో తేదీన తొలిసారిగా ఎన్నికను నిర్వహించగా కొంతమంది పిల్లల తల్లిదండ్రులు హాజరు కాలేదు. దీంతో అప్పుడు ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. అలాగే 17వ తేదీన మరోసారి ఎన్నిక నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ ఈసారి కూడా కొంతమంది తల్లిదండ్రులు గైర్హాజర్ కావడంతో వాయిదా పడింది. ఇక్కడ రాజకీయ జోక్యం కారణంగానే ఎన్నిక వాయిదా పడినట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే మూడోసారి ఎన్నికను పూర్తి చేయడానికి నిర్ణయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు కూడా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

టెక్కలి మేజర్ పంచాయతీ ఈవోగా జగన్నాథం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ ఈవోగా కె.వి.వి.జగన్నాథం బుధవారం విధుల్లోకి చేరారు. నరసన్నపేట మండలం మడపాం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న జగన్నాథం పదోన్నతిపై టెక్కలి కార్య నిర్వాహణాధికారిగా ఇక్కడకు వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

హనుమాన్ విగ్రహం ప్రతిష్ట


ప్రతిష్టించిన హనుమాన్ విగ్రహం

ఇచ్ఛాపురం: పట్టణంలోని ఉప్పలవీధి–గిలాయి వీధి కూడలిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా బుధవారం నిర్వహించారు. అర్చకులు తేజేశ్వరశర్మ పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజా కార్యక్రమాలు చేపట్టారు. పూజా కార్యక్రమంలో స్థానిక భక్తులతోపాటు ఒడిశాకు చెందిన వేదపండితులు మరమోహన శర్మ, చంద్రభానుశర్మ పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో టెక్కలి కండ్రవీధిలోని సత్యసాయి పెద్ద మందిరంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ బి.మల్లేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలకు సుమారు 50 రోజుల పాటు శిక్షణతోపాటు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 94902 22964, 85550 99981 నంబర్లను సంప్రదించాలని కోరారు.